క్లుప్తంగా

క్రికెట్ విజేత ట్రెండ్ యూత్ జట్టు



ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని కాటాపూర్‌లో ఈసం రాజారామ్ కిషోర్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తాడ్వాయి ట్రెండ్ యూత్ జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు రూ.15 వేల నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను నిర్వాహకులు అందజేశారు. కాటాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ గాందర్ల శంకర్ కుమారుడు కిడ్నీ, లివర్ సమస్యతో బాధపడుతుండగా తాడ్వాయి మాజీ సర్పంచ్, ట్రెండ్ యూత్ సభ్యులు రూ.2 వేల ఆర్థిక సాయం అందజేశారు.

రోడ్డుపైనే మురుగు నీరు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి సెంటర్‌లో రోడ్డుపైనే మురుగు నీరు నిల్వ ఉండటంతో రోడ్డుపై నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్డు పైనే నిలుస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఈ రహదారిపై వందల మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి పై వెళ్లేందుకు వాహనదారులు, పాదచారులు అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రామోజీరావుకు నివాళి



వెంకటాపురం(కె): ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి మండల మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో సంతాప సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రవీణ్, సంతోష శ్యామ్, రాంబాబు, గణేష అశోక్, అనిల్, సాంబశివరావు, వినాయకరావు, అభి, జగన్మోహనరావు, వికాష రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.

ఆర్థికసాయం



మంగపేట : మండలంలోని కమలాపురంలో అనారోగ్యంతో మృతిచెందిన పల్లెర్ల భాగ్యమ్మ కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆదివారం రూ.5 వేల నగదను అందజేశారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న భాగ్యమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని బరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు చింతా పున్నారావు, నాయకులు తూడి భగవాన్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బేవర సత్యనారాయణ, సీనియర్ నాయకులు బరెడ్డి సాంబిరెడ్డి, నిమ్మల రాంబాబు, చింతా సంపత్, కృష్ణయ్య, గాజర్ల రాజు, కోల శివ, తలారి గోపి, బుజ్జి, ఎస్కే పర్వీన్, సరళరాణి తదితరులు ఉన్నారు.

గ్రామసభ మళ్లీ నిర్వహించాలి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల ఇసుక రీచ్ నిర్వహణ అధికారులు తిరిగి గ్రామసభ నిర్వహించాలని సమ్మక్క, సారక్క సొసైటీ సభ్యులు కోరారు. ఆదివారం మండల పరిధిలోని చొక్కాల గ్రామంలో సమ్మక్క, సారక్క ఇసుక సొసైటీ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక సొసైటీ కోసం గత కొంతకాలంగా సొసైటీ సభ్యులు కష్టపడుతున్నామని అన్నారు. కొత్తగా ఏర్పడ్డ సొసైటీకి ఇసుక రీచ్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు గతంలో నిర్వహించిన గ్రామసభను రద్దు చేసి తిరిగి చొక్కాల గ్రామంలో పీసా గ్రామసభను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సమ్మక్క, భార్గవ్, భరత్ కుమార్, సూజాత, మాణిక్యం తదితరులు ఉన్నారు.

మండలానికి పొంచి ఉన్న ప్రమాదం

- కరకట్టతోనే రక్షణ
- కోతకు గురవుతున్న చిన్నగడ్డ
- లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్న వరదలు



కోతకు గురవుతున్న చేను



భూమి కొట్టుకుపోవడంతో తేలిన రాళ్లు



వాజేడును కాపాడుతున్న చిన్నగడ్డ

వాజేడు : వాజేడు మండలానికి గోదావరి నుంచి ముప్పు పొంచి ఉంది. జీవనగంగ అయిన గోదావరి రైతుల పాలిట శాపంగా మారింది. ప్రతి ఏడాది వచ్చే వరదల కారణంగా గడ్డ కోతకు గురవుతుండటంతో రైతుల భూములు వరదలో కలిసి పోతున్నాయి. దీంతో రైతుల పేరుపై పట్టాలు ఉన్నప్పటికీ సాగు చేసుకునే భూములు కానరావడం లేదు. చేలు, పొలాలు గోదావరి వరద మూలంగా ఇసుక మాత్రమే మిగిలిపోతుంది. మండల పరిధిలోని లొట్టిపిట్టగండి నుంచి ఎడ్జర్లపల్లి వరకు మండలవ్యాప్తంగా గోదావరి పరివాహకం వెంట వందలాది ఎకరాల భూములు కోతకు గురైనట్లు రైతులు భావిస్తున్నారు. రికార్డుల ప్రకారం రైతులకు భూములు ఉన్నా అవి కనిపించని దుస్థితి. వర్షాకాలం వచ్చిందంటే చాలు గోదావరి పరివాహకం వెంట ఉన్న రైతులకు కొంతవరకు నష్టం వాటిల్లినట్లే. గోదావరి ఒడ్డు కోతకు గురవుతుండడంతో రైతుల భూములు కూడా నీటిలో కలిసిపోతున్నాయి. ఇలా ఇప్పటికీ వందలాది ఎకరాల వరకు పంట భూములను రైతులు నష్టపోయినట్లు సమాచారం.

కోతకు గురవుతున్న భూములు

తుపాకులగూడెం వద్ద నిర్మించిన బ్యారేజీ ఎగువ ప్రాంతంలో ఉండటంతో వర్షాకాలంలో దిగువకు విడుదల చేసే వరదనీటితో మండల పరిధిలోని చంద్రుపట్ల, టేకులగూడెం, పేరూరు ఇలా పలు గ్రామాల సరిహద్దుల్లో భూములు, ఒడ్డు కోతకు గురవుతున్నాయి. కంతెనపల్లి, చింతూరు గ్రామాల మధ్య నుంచి నేరుగా వచ్చిన గోదావరి వాజేడు వద్ద దరికి తగులతోంది. దీంతో మండలకేంద్రం వద్ద గోదావరి దరి ప్రతీ సంవత్సరం కొంతమేర కోతకు గురవుతోంది. గోదావరి వరద నేరుగా రాకుండా వాజేడు వద్ద మధ్యలో ఉన్న చిన్నగడ్డ అడ్డు కుంటుంది. ప్రతీ సంవత్సరం వస్తున్న వరదలకు ఏటా కోతకు గురవుతుంది. గతంలో పెద్దగడ్డ సుమారు 400 ఎకరాల మేర ఉండగా గోదావరి వరద నీటితో కోతకు గురై నేడు కాన రాకుండా పోయింది. నేడు అక్కడ కేవలం ఇసుక మేటలే మిగిలాయి. ఇప్పుడు చిన్న గడ్డ కూడా తరిగిపోతుండటంతో మండలకేంద్ర వాసుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షాలు ఉన్నాయనే వాతావరణ శాఖ ప్రకటనతో ప్రజల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ఇదే జరిగితే చిన్నగడ్డ పూర్తిగా తరిగి పోయే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే గోదా వరి వరదతో ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

కరకట్ట నిర్మించాలి

మండలానికి గోదావరి మూలంగా ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండాలంటే లొట్టిపిట్ట గండి నుంచి ఎడ్జర్లపల్లి వరకు గోదావరి ఒడ్డు వెంట కరకట్ట నిర్మించాల్సి ఉంటుంది. కరకట్ట నిర్మించకపోతే మండలానికి గోదావరి వలన ప్రతీ సంవత్సరం నష్టం జరుగుతూనే ఉంటుంది. ప్రతి ఏడాది గోదావరి కోతతో కొంత మేర ఒడ్డును, పంట చేలను కోల్పోతున్న మండల ప్రజలు, రైతులు తమకు కరకట్ట నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఇదే విషయాన్ని కొందరు ప్రజలు గతంలో మంత్రిగా పని చేసిన సమయంలో తుమ్మల నాగేశ్వరావు దృష్టికి తీసుకెళ్లారు. 2022, 2023 సంవత్సరాల్లో వచ్చిన వరదల మూలంగా మండలంలో పలు గ్రామాలు ముంపునకు గురికావడంతో పాటు పొలాలు, పంట చేలు నీటిలో మునిగి భారీనష్టం వాటిల్లింది. ఇప్పుడు కూడా తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయశాఖ మంత్రిగా ఉండటంతో కరకట్టను మంజూరు చేయించి మండలానికి ఎలాంటి ప్రమాదం, నష్టం జరుగ కుండా చూడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలి



కమలాపురంలో నిలిపి ఉంచిన అంబులెన్స్

మంగపేట: స్థానిక పీహెచ్‌సీలో 108 అంబులెన్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. పీహెచ్‌సీలో అంబులెన్స్‌తో పాటు 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటూ విశ్రాంతి తీసుకునేందుకు వారికి ప్రత్యేక గదిని కేటాయించారు. అయినప్పటికీ అంబులెన్స్‌ను పీహెచ్‌సీలో కాకుండా కమలాపురంలో ఉంచడం వెనుక అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, డెలివరీ కేసులను పీహెచ్‌సీకి తరలించేందుకు అంబులెన్స్ అవసరం అయితే కమలాపురం నుంచి అంబులెన్స్ రావడానికి ఆలస్యం అవుతుందన్నారు. ఇటీవల అంబులెన్స్ రావడం డెలివరీ పేషెంట్‌ను పీహెచ్‌సీకి తీసుకురావడంతో ఆలస్యం కావడంతో అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగిందని సమాచారం. కనీస సౌకర్యం లేని కమలాపురంలో అంబులెన్స్‌ను ఉంచడం మండలానికి చివరి గ్రామమైన కమలాపురంలో ఉంచడం ఎంతవరకు సమంజసమన్నారు. అధికారులు స్పందించి అంబు లెన్స్‌ను మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విప్లవ పార్టీలకు దూరంగా ఉండాలి



వాజేడు : గ్రామస్తులతో మాట్లాడుతున్నఎస్సై వెంకటేశ్వర్‌రావు



ఎస్ఎస్ తాడ్వాయి : గోనెపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

వాజేడు: కాలం చెల్లిన సిద్ధాంతాలతో అమాయక ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టు కుంటున్న విప్లవ పార్టీలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎవరూ కూడా సహకరించ వద్దని వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ఇప్పగూడెంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ మావోయిస్టుల మూలంగా ప్రజలకు నష్టమే తప్ప ఏ విధమైన లాభం లేదన్నారు. ఎవరైనా అనుమానితులు, కొత్త వ్యక్తులు గ్రామ పరిసరాల్లో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం మండల పరిధిలోని గుమ్మడిదొడ్డి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు.

గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుపై ఎస్సై తమ సిబ్బందితో కలిసి నేరుగా గోనపెల్లి గ్రామస్తులతో సమావేశమై ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. అనంతరం నార్లాపూర్‌లో గుడుంబా తయారీదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జంపన్నవాగు వద్ద పెట్రోలింగ్ నిర్వహించి వాహనాలను తనిఖీ చేశారు. గోనెపల్లి గ్రామంలోని గుత్తికోయ గూడేన్ని సందర్శించారు. అయన వెంట ఏఎస్సై చింత నారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండుగ



చెక్క బండిని తీసుకెళ్తున్న గ్రామస్తులు

వాజేడు: మండల పరిధిలోని నాగారం, వాజేడు, ప్రగళ్లపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఎల్లనంపుడు (గ్రామ దేవతల) పండుగను ఘనంగా నిర్వహించారు. వర్షాలు పడగానే వ్యవసాయ పనులకు సన్నద్ధం కావడం కోసం ముందస్తుగా ఈ పండుగను నిర్వహిస్తారు. అదే విధంగా గ్రామం లోనికి ఎలాంటి దుష్టశక్తులు రాకుండా ఉండటం, పంటలు పుష్కలంగా పండటం కోసం గిరిజనులు తమ సంప్రదాయ పద్ధతుల్లో ఈ పండుగను నిర్వహిస్తుంటారు. గ్రామదేవతల గుడి వద్ద చెక్కలతో తయారు చేసిన చిన్న బండిని పూజల అనంతరం తీసుకువెళ్లి గ్రామం చివరలో ఉంచారు. అనంతరం గుడి వద్ద మొక్కులను సమర్పించి పంటలు పుష్కలంగా పండాలని కోరుకున్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

భూపాలపల్లి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కొంపెల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమరేందర్ గ్రామస్తులను కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేంద్రచారి, కార్తీక్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



భూపాలపల్లిరూరల్: జయశంకర్ భూపాలపల్లి రజక సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు గోప రాజు సాంబలక్ష్మితో పాటు పలువురు నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పెడిపల్లి రమక్క , బొమ్మెర రాజేశ్వరి(టీయూఎఫ్ ఉపాధ్యక్షురాలు), రజక సంఘం సభ్యులు పోతపెల్లి రాజలక్ష్మి, తిరుపతి, రమేష్, రాములు, రమ్య, మంజుల, జౌర బేగం, స్వప్న, లక్ష్మీ, ప్రశాంత్, సరోజనలతో పాటు మరో 20 మంది ఉన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముంజాల రవీందర్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు క్యాతరాజు సాంబమూర్తి, మహిళా పట్టణ ప్రధాన కార్యదర్శి పద్మ, నాయకురాలు పుష్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూపాలపల్లి మండలంలోని శ్యాంనగర్ గ్రామంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డిగానిపల్లి గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాల సభ్యులను పరామర్శించారు.

అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీల సీజ్



గోవిందరావుపేట: అదనపు లోడుతో వెళ్తున్న లారీలను పట్టుకున్న పస్రా పోలీసులు

మంగపేట: మండలం మీదుగా అదనపు ఇసుక లోడుతో వెళ్తున్న ఎనిమిది ఇసుక లారీలను ఆదివారం సాయంత్రం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహన తనిఖీ లు నిర్వహిస్తుండగా భద్రాద్రికొత్తగూడెం జిల్లా నుంచి అధిక లోడుతో పరిమితికి మించి వచ్చిన 8 లారీలను కమలాపురం వే బ్రిడ్జి వద్ద కాంటా పెట్టించగా ఒక్కో లారీలో 10 టన్నుల ఇసుక అధికంగా ఉన్నట్లు గుర్తించి ఆయా లారీలను సీజ్ చేశామన్నారు. ఇసుక ర్యాంపుల నుంచి అధిక లోడుతో ఎవరైనా లారీల్లో పరిమితికి మించి ఇసుక రవాణా చేస్తే వారిపై కేసు నమోదు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గోవిందరావుపేట: మండలంలోని పస్రాలో అదనపు ఇసుక లోడుతో వెళ్తున్న ఎనిమిది లారీలను ఆదివారం సాయంత్రం పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై అచ్చె కమలాకర్ తెలిపారు. అధిక లోడుతో ఇసుకను తరలిస్తున్నారనే పక్కా సమాచారం 4 లారీలను స్వాధీనం చేసుకుని పరిశీలించగా పరిమితికి మించి ఇసుక ఉండటంతో వాటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీలకు జరిమానా

ఏటూరునాగారం: ఏటూరునాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మండల కేంద్రంలో స్థానిక సీఐ రాజు ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న ఇసుక లారీలను నిలిపి వేయింగ్ బ్రిడ్జి వద్ద తూకం వేయగా అధిక బరువుగా ఉన్నట్లు గుర్తించారు. ఐదు లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. వాటికి జరిమానా విధించామన్నారు. ఈ లారీలు కన్నాయిగూడెం మండలం ఏటూరు ఇసుక క్వారీ నుంచి వస్తున్నట్లు తెలిపారు.

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి



ఏటూరునాగారం : బాణసంచా కాల్చుతున్న బీజేపీ నాయకులు



ములుగు రూరల్ : జాతీయ రహదారిపై సంబురాలు జరుపుకున్న బీజేపీ శ్రేణులు



ఎస్ఎస్‌తాడ్వాయి : కాటాపూర్‌లో బాణసంచా కాల్చుతున్న నాయకులు

ఏటూరునాగారం: నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్ అన్నారు. ప్రధానిగా మోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేయడంతో ఆదివారం మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణంలో బీజేపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో దళితమోర్చా నాయకుడు జనార్దన్, పల్లా బుచ్చయ్య, రామరాజు, చక్రవర్తి, సంపత్, చంద్రారెడ్డి, రమేష్, శ్రీనివాస్, హరి బాబు, ఎల్లయ్య, నాగేశ్వర్‌రావు, గంగా, రాధిక, మమత పాల్గొన్నారు.

బీజేపీ సంబురాలు

ములుగు రూరల్ : కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేయడంతో జిల్లా కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జాతీయ రహదారిపై బాణసంచకాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారం చేపట్టే దిశగా కార్యకర్తలు నాయకులు పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, రవింద్రాచారి, నాగరాజు, రవిరెడ్డి, హేమాద్రి, రాజ్‌కుమార్, రాజేష్, పాపిరెడ్డి, సంపత్, ప్రవీణ్, పాల్గొన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం సంబురాలు జరుపుకున్నారు. మండలంలోని కాటాపూర్‌లో మండల ప్రధాన కార్యదర్శి మెడిశెట్టి పురుషోత్తం ఆధ్వర్యంలో నాయకులు రోడ్డుపై ర్యాలీ నిర్వహించి బాణసంచాకాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు, నాయకులు నరేష్, సేనాపతి, హన్మంతరెడ్డి, నవీన్, కుమార్, నగేషులు పాల్గొన్నారు.

రైతుల చూపు.. దళారుల వైపు ?



సెంటర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

- కొనుగోళ్లలో జాప్యంపై సెంటర్‌లో రైతుల నిరసన

మల్హర్ : రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదు. నెలరోజులకు పైగా ధాన్యం సేకరించడంలో సెంటర్ నిర్వాహకులు జాప్యం చేస్తుండంతో రైతులు దళారుల వైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని ఎడ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోళ్ల కేంద్రంలో ధాన్యం సేకరణ సక్రమంగా జరగడం లేదంటూ ఆదివారం సెంటర్లో రైతులు సమ్మక్క, బీమక్క, విమల, రమ, రమక్క, నీలమ్మ, తిరుపతి, సమ్మయ్య, చంద్రయ్య, రాజసమ్మయ్య, బుచ్చన్న, రవీందర్‌లు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీఎంఎస్ ఆధర్వంలో ఏర్పాటు చేసిన సెంటర్ ప్రారంభం నాటి నుంచి ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. సెంటర్ నిర్వాహకులను సంప్రదిస్తే మ్యాచర్ రావడం లేదని, లారీలు రావడం లేదని సాకుతో ధాన్యం సేకరించడం లేదని చెబుతున్నారు. వర్షాలు కురవడంతో మూడు, నాలుగుసార్లు ధాన్యం తడిసిందన్నారు. ధాన్యాన్ని ఆరబోసి, కుప్పలు చేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలను సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చేసేది ఏమి లేక ప్రభుత్వ ఇచ్చిన గిట్టుబాటు ధర కంటే తక్కువగా రూ.1800 నుంచి రూ. 1900 లకు దళారులకు అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నామని రైతులు వెల్లడిస్తున్నారు.

నేత్రదానానికి ముందుకు రండి

మల్హర్ : అపోహలు వీడి..నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సింగరేణి సంస్థ మణుగూరు ఎస్ఎంఎస్ ప్లాంట్ పీఓ నరసింహస్వామి పిలుపునిచ్చారు. మండలంలోని వల్లెకుంట గ్రామానికి చెందిన వేముల జగ్గారావు (82) రైతు ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపును ప్రసాదించారు. ఆదివారం గ్రామంలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పీఓ నరసింహస్వామి హాజరయ్యారు. నేత్ర, అవయవ, దేహదానంపై సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి అవగాహన కల్పించారు. తండ్రి నేత్రాలు దానం చేసి ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించిన కొడుకు, కోడలు శ్రీనివాస్-రాణి, కూతుళ్లు, అల్లుళ్లు శ్రీలత-పీ శ్రీనివాస్, జయశ్రీ-ప్రసాద్‌రావు, హరిప్రియ-మధుసూదన్‌రావునుఅభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిట్యాల : వేదికపై ఉపాధ్యాయులతో విద్యార్థులు



మల్హర్ : తాడిచర్ల ఉన్నత పాఠశాలలో..

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2005 బ్యాచ్‌కి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం చదువు నేర్పిన గురువులకు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుర్ర వెంకటేశ్ గౌడ్, చింతల రాజేందర్, మహేష్, రాజు, శ్రీకాంత్, రాజేష్, రాజు, మహేష్‌తో పాటు 140 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 2003-04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల మధ్య నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. వీరు మధ్య నుంచి అకాల మరణంతో వెళ్లిపోయిన మిత్రులను గుర్తుచేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులందరూ ఒకే చోట చేరవడంతో సందడి నెలకొంది.

ఉద్యమకారులకు ఇంటి స్థలం కేటాయించాలి

ములుగు: ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించడంతో పాటు పెన్షన్ ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మురహరి భిక్షపతి ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక కమిటీని నియమించాలన్నారు. ఉద్యమకారుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గరిగె రఘు, బైకాని ఓదెలు, గడ్డమీది భాస్కర్, బత్తుల రాణి, మేడుదుల వెంకన్న, దర్శనాల సంజీవ, కడారి తిరుపతి, కొండి రమేష్, బానోత్ గోపిచంద్, కొండా రమేష్ తదితరులు పాల్గొన్నారు.